ప్రజాశక్తి
మంగళవారం 11 నవంబర్ 2025

జాతీయస్థాయి జూడో పోటీలకు జాహ్నవి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రమైన సోమందేపల్లికి చెందిన వాల్మీకి దాము, దీప దంపతుల కుమార్తె జాహ్నవి జాతీయ స్థాయి జూడోకు ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. జాహ్నవి స్థానిక క్రీస్తు జ్యోతి ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించింది. జాహ్నవి త్వరలో మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో జాహ్నవిని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, గ్రామ స్తులు, విద్యార్థులు అభినందించారు.

జూడో పోటీలకు ఎంపికైన జాహ్నవి



లెక్కా లేదు.. జమా లేదు..!

- పనులెక్కడో తెలియదు.. డబ్బులు మింగేశారు
- ఒక్క పంచాయతీలోనే రూ.71 లక్షలు స్వాహా
- చనిపోయిన వారి పేరున బిల్లులు
- సామాజిక తనిఖీల్లో వెలుగులోకి 'ఉపాధి' అవినీతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కూలీలు, నిరుపేదల కష్టార్జితానికి దక్కాల్సిన డబ్బులను కొంత మంది ఉద్యోగులు, వారి వెనకున్న నేతలు కలసి దోచేసుకుంటున్నారు. దోపిడీకి లెక్కా లేదు జమ లేదు. ఎంత వీలు పడితే అంత మేసేసే కార్యక్రమం ఉపాధి హామీ పథకంలో జరుగుతుండటం గమనార్హం. ఈ అవినీతి బాగోతాలు సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది జరిగిన సామాజిక తనిఖీలను పరిశీలించినప్పుడు రెండు పంచాయతీల పరిధిలోనే లక్షల రూపాయల్లో అవినీతి జరిగిందన్నది స్పష్టమైంది. శెట్టూరు మండలం కనుకూరు, గుమ్మగట్ట మండలం బేలోడులో జరిగిన సామాజిక తనిఖీల్లోని వెలుగులోకి వచ్చిన అవినీతి బాగోతాలు ఈ విధంగానున్నాయి.

పనులెక్కడో తెలియదు..డబ్బులు మాత్రం రూ.71 లక్షలు మింగేశారు

శెట్టూరు మండలం కునుకూరు గ్రామంలో ఈ ఏడాది సెప్టెంబరు మాసంలో సామాజిక తనిఖీ జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ గ్రామం పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ బృందం పరిశీలించింది. ఇందులో చూస్తే మొత్తం రూ.2.19 కోట్ల విలువైన పనులు ఆ ఏడాదిలో జరిగాయి. ఇందులో మొత్తం 305 పనులు జరిగాయి. అయితే ఇందులో 40 పనులు మాత్రం ఎక్కడ జరిగాయో పని చేయించిన వారికి కూడా తెలియదు. పనిచేసినట్టు మాత్రం ఎంబుక్‌లో రికార్డు చేశారు. ఎవరు... ఎక్కడ పనిచేసారన్న

వివరాలు కూడా లేకుండానే ఎంబుక్ రికార్డు చేసి రూ.71.5 లక్షలు బిల్లు చేశారు. ఇక పనిచేసినట్టు నాటే బోర్డు ఏర్పాటు చేసినట్టు చూపించి రూ.2.30 లక్షలు కాజేశారు. అటువంటి బోర్డు ఏదీ ఆ ప్రాంతంలో కనబడడనట్లు సామాజిక తనిఖీలో తేలింది. ఇక మామిడి మొక్కలు ఇచ్చినవి తక్కువ... బిల్లులు చేసినవి ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ రకంగా ఈ ఒక్క పంచాయతీ పరిధిలోనే దాదాపు సగం డబ్బులకు లెక్క జమలేకుండా ఉన్నట్టు తేలింది.

చనిపోయిన వ్యక్తి పేరున డబ్బులు డ్రా

ఇక శెట్టూరు మండలం బేలుడోలో మరిన్ని చిత్రాలున్నాయి. ఈ గ్రామంలో చనిపోయిన వ్యక్తి ఉపాధి హామీ పనికొచ్చి ఆయనకు బిల్లులు ఇచ్చినట్టు రికార్డుల్లో చూపించారు. ఆయన పేరు మీద రూ.3300 డ్రా చేశారు. ఇక ఇంకుడు గుంత నిర్మించామని రికార్డుల్లో నమోదు చేసి రూ.4.93 లక్షలు కాజేశారు. వారు నమోదు చేసిన ప్రాంతంలో ఇంకుడు గుంత ఆనవాళ్లు కూడా కనిపించకపోవడం గమనార్హం. తిప్పేస్వామి అనే రైతు పొలంలో ఫారం పాండ్ తవ్వామని రూ.26256 డబ్బులు కాజేశారు. యల్లప్ప అనే రైతు పొలంలో రూ.31 వేలు, లక్ష్మిరెడ్డి పొలంలో రూ.27 వేలు ఇలా రైతుల పొలాల్లో పారం పాండ్ తవ్వినట్టు చూపించారు. అక్కడ అటువంటి ఆనవాళ్లులేవు. ఇక ఈ గ్రామంలో చేసిన పనికంటే నమోదు అధికంగా ఉంది. ఈ రకంగా ఈ పంచాయతీ పరిధిలో రూ.30 లక్షల వరకు అదనపు చెల్లింపులు జరిపినట్టు సామాజిక తనిఖీల్లో తేలింది. ఇంకా కొన్ని మండలాల్లోనే సామాజిక తనిఖీ జరిగింది. ఇంకా అనేక మండలాల్లోనూ, పంచాయతీల్లోనూ జరగాల్సి ఉంది. ఇవన్నీ జరిగితే ఏ మేరకు అవినీతి బండారం బయటకు వస్తుందో చూడాల్సి ఉంది.

విలేకరిపై దాడి అమానుషం

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
జిల్లా వ్యాప్తంగా నిరసనలు
నిందితులను అరెస్టు చేయాలంటూ డిమాండ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై జరిగిన దాడి అమానుషమని దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాశక్తి విలేకరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, విలేకరులపై దాడి చేయడం అమానుషమన్నారు. ఈ చర్య ప్రజా ప్రతినిధులకు సిగ్గుచేటు అన్నారు. మండలంలో రూ. 45 లక్షలతో సిసి రహదారులు నిర్మాణాలు జరుగు తున్నాయన్నారు. రహదారులను నాసిరకంగా, నిర్మిస్తున్నారని ప్రజాశక్తి విలేకర్ శంకర్ వార్త రాస్తే దీన్ని ఓర్వలేని టిడిపి సీనియర్ నాయకుడు కాంట్రాక్టర్ నాగరాజు యాదవ్ తన అనుచరులతో శంకర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు అసభ్యంగా దుర్భాషలాడి బెదిరించారన్నారు. శంకర్ కు సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని దౌర్జన్యంగా తీసుకువెళ్లి ఫోన్ ద్వారా ఆయనను బెదిరించారన్నారు. అంతేకాకుండా విలేకరి శంకర్ పై నాగరాజు యాదవ్, ఆయన కుమారుడు, తన అనుచరులతో దారి కాచి విచక్షణ రహితంగా కర్రలతో దాడి చేయడం అమానుషమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ ను కలిసి వినతి పత్రం సమర్పించామన్నారురు. స్పందించిన కలెక్టర్ పాత్రికేయులపై దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి శివ, జిల్లా ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, పాత్రికేయులు పుట్టపర్తి బసప్ప, మహేష్, బుక్కపట్నం శ్రీనివాసులు, కొత్తచెరువు శ్రీరాములు, లక్ష్మీనారాయణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

చిలమత్తూరు మండలంలో ప్రజాశక్తి విలేకరిపై దాడి చేయడం అమానుషమని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న పేర్కొన్నారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్ లో కలెక్టర్ ను కలిసి ప్రజాశక్తి పాత్రికేయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సత్య సాయి జిల్లాలో విలేకరులపై దాడులు పెరిగిపోయాయన్నారు. విలేకరులపై ఇలాంటి దాడులు పునరాగం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దాడి దారుణం

చిలమత్తూరు : ప్రజాశక్తి విలేకరి శంకర్ పై దాడి చేసిన టీడిపి నాయకులు నాగరాజు యాదవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం డీటీ జగన్నాథ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో టిడిపి ఆగడాలు అదికమయ్యాయని విలేకర్ల పై దాడి చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని విమర్శించారు. ఇది రాజ్యాంగంపై జరిగిన దాడి అన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ నియోజక వర్గంలో ఇలాంటి ఘటన జరుగుతుంటే ఆయన స్పందించక పోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛను కాపాడల్సిన బాద్యత ప్రజా ప్రతినిధులపై ఉంటుందని అన్నారు. అవినీతీపై ప్రశ్నిస్తే విలేకర్ల పై దాడి చేయడం దారుణం అన్నారు. ఉన్నత అదికారులు స్పందించాలన్నారు. రోడ్డు నిర్మాణ పనులపై విచారణ చేపట్టాలని క్వాలిటీ చెక్ చేయాలని అన్నారు. నిందితులపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, రామచంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ ఐ ఆర్ నమోదు : ప్రజాశక్తి విలేకరి శంకర్ పై జరిగిన దాడిపై చిలమత్తూరు పోలీస్ స్టెషన్ లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. నాగరాజు యాదవ్,అతని కుమారుడు హరీష్ యాదవ్ విలేకరి శంకరప్పను అడ్డగించి సెల్ ఫోన్, ద్విచక్రవాహనం లాక్కొని దాడికి పాల్పడ్డారని అన్నారు. శంకర్ శరీరంపై దాడి తాలుకు గాయాలున్నాయని అన్నారు. ఈ మేరకు బాధితుడు ఎన్ శంకరప్ప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హిందూపురం : సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలోనే జర్నలిస్టులకు రక్షణ కరువైందని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. చిలమత్తూరు మండల ప్రజాశక్తి విలేకరిపై టిడిపి నాయకుడు నాగరాజ్ యాదవ్ ఆయన కుమారుడు హరీష్ చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. దాడికి నిరసనగా హిందూపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు జర్నలిస్టులు నల్ల బ్యాడ్జిలు ధరించి, నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహసిల్దార్ వెంకటేసుకు వినతిని అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, విలేకరులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువచ్చినప్పటికీ అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఎవరు ఉంటే వారు జర్నలిస్టుల పైన దాడులు చేయడం సర్వసాధారణమైందన్నారు. ఈ విషయంపై బాలకృష్ణ స్పందించి దాడి చేసిన నాగరాజు యాదవ్ అతని కుమారుడు హరీష్ లను అరెస్టు చేయించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పార్టీ నుంచి నాగరాజు యాదవ్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాగరాజ్ యాదవ్ ఇప్పటివరకు ఏ అభివృద్ధి పనులు చేపట్టారో ఆ పనులు అన్నింటి పైన విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జర్నలిస్టులకు అండగా ఉంటాం : విద్యార్థిసంఘాలు

ప్రతిక్షణం ప్రజా సమస్యలపై అక్షర పోరాటం చేస్తున్న జర్నలిస్టులకు విద్యార్థి సంఘాలు అండగా ఉంటాయని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. చిలమత్తూరు ప్రజాశక్తి విలేఖరి శంకర్ పై జరిగిన దాడిని వారు ఖండించారు. ఈ విషయంపై హిందూపురం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇది టిడిపి నాయకులు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జర్నలిస్టుల పైన దాడులు జరిగితే ఖండించడంతోపాటు అండగా ఉంటామని అన్నారు. అధికారంలోకి రాగానే అవినీతికి పాల్పడుతూ, దీనిని ప్రశ్నించిన పాత్రికేయులపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. విచక్షణ కోల్పోయి విచక్షణ రహితంగా దాడి చేసిన నాగరాజ్ యాదవ్ ఇతని కుమారుడు హరీష్ లపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వారి హక్కుల కోసం చేసే ప్రతి ఆందోళనలకు విద్యార్థి సంఘాలు పూర్తి మద్దతు పలుకడంతో పాటు వారికి అండగా నిలుస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బాబావలి, కదిరిష్ కదిరిష్, రవికుమార్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల భద్రకు నూతన టెక్నాలజీ

ఏపీ నేషనల్ హైవే ఇంజనీరింగ్ చీఫ్ వి.రామచంద్ర

హైవే రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జాతీయ రహదారుల భద్రతే లక్ష్యంగా వినూత్నప్రయోగంగా డాన్స్ ఫైబర్ టెక్నాలజీని ఉపయోగించామని ఏపీ నేషనల్ హైవే ఇంజనీరింగ్ చీఫ్ వి.రామచంద్ర పేర్కొన్నారు. ఆదివారం వెంకటగారి పల్లి క్రాస్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోతులు లేని రహదారుల నిర్మాణమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిందన్నారు. తొలిసారి రాష్ట్రంలో రహదారులపై డానిష్ ఫైబర్ టెక్నాలజీతో పనులు చేపట్టారన్నారు. పుట్టపర్తి వద్ద కోడూరు వరకు నిర్మాణ దశలో ఉన్న ఎన్ హెచ్ - 342 నాలుగు వరుసల రహదారిపై అధికార యంత్రాంగం ప్రయోగాత్మకంగా ఈ టెక్నాలజీ ద్వారా రోడ్డు వేయడం జరిగిందన్నారు. డెన్మార్క్ దేశం నుంచి రెండు రకాల ఫైబర్ తెప్పించి రోడ్ల నాణ్యత పెంచేందుకు ఈ ప్రయోగం చేస్తున్నామన్నారు. సాధారణ రోడ్లు 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేయాల్సి వస్తే ఈ డానిష్ ఫైబర్ టెక్నాలజీతో వేసిన రోడ్లు 8 నుంచి 10 ఏళ్ల తర్వాత రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. రోడ్ల నాణ్యత పెంచేందుకు సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జూలై 4న నంద్యాలలో ఈ ప్రయోగం చేశామని, తొలిసారి జాతీయ రహదారులకు ఇక్కడ ఈ ప్రయోగం చేస్తున్నామని తెలిపారు. భారీ వాహనాలు రోడ్లపైకి వచ్చినప్పటికీ పాట్‌హోల్స్ పడకుండా పదేళ్ల వరకు ఈ టెక్నాలజీతో రోడ్లు వేస్తే మన్నికగా ఉంటాయని ఇక్కడ ప్రయోగాత్మకంగా చేపట్టిన పని సక్సెస్ అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని రోడ్లకు దీనిని అనుసరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి రిటైర్డ్ నేషనల్ హైవే ఇంజనీరింగ్ చీఫ్ నయీముల్లా, డెన్మార్క్ విదేశీయుడు జోష్ సెబాస్టియన్, మైక్ గ్లోవర్, ఆర్ అండ్ బి ఈఈ సంజీవయ్య, నేషనల్ హైవే డీఈఈ గిడ్డయ్య, ఆర్ అండ్ బి ఏఈఈ కావ్య, డీఈ నాగ పుల్లమరావు, ఏఈఈ హారిక, రేసిడెంట్ ఇంజనీర్ రవి, ఎన్ఎస్ పిఆర్ కాంట్రాక్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి మతి భ్రమించింది : ఎంపీ

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

కళ్యాణదుర్గంలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు జయంతి వేడుకలను మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం చూసి వైసిపి మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎంపీ బికె.పార్థసారథి ఎద్దేవా చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'మాధవ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. వైసిపి పాలనలో కురుబ సామాజిక వర్గానికి చెందిన శంకర నారాయణ, ఉషశ్రీచరణ్ మంత్రులుగా గోరంట్ల మాధవ్ ఎంపీగా ఉండి కులాన్ని అడ్డం పెట్టుకుని పదవులు అనుభవించారే తప్ప వారు కులానికి చేసింది శూన్యం అన్నారు. అలాంటి వారు కురుబ కులం గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కురుబల అభివృద్ధి కోసం దాదాపు పది కళ్యాణ మండపాలు నిర్మించిన ఘనత మాది అన్నారు. అలాగే బీసీ కులాల కోసం అహర్నిశలు పాటుపడుతున్నది కూటమి ప్రభుత్వం అన్నారు. ఇకనైనా మాధవ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని సూచించారు.

చిన్నారికి ఎలక్ట్రికల్ వీల్‌చైర్ పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాల ద్వారా వికలాంగ చిన్నారులకు ఉపకరణాలు అందించడంలో భాగంగా సోమవారం స్థానిక భవిత కేంద్రంలోని వికలాంగురాలు అశ్విన్ కు ఎలక్ట్రో మోటార్ వీల్ చైర్ అందించారు. జిల్లా కలెక్టర్ అందించిన మోటార్ వీల్ చైర్ ను మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప అందించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం శాశ్వత దాత బైసాని రాంప్రసాద్, దుర్గాబాయి దేశ్ ముఖ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు లలిత, నందిని చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురంలో జరుగుతున్న సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కన్వీనర్ రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సివిల్ సప్లై గోదాము వద్ద మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ ఆధీనంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. స్టాక్ పాయింట్ వద్ద విశ్రాంతి గదులు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రతి స్టాక్ పాయింట్ వద్ద విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలన్నారు. కోర్టు అడ్డంకులను తొలగించి కార్మికులందరికీ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. వీటితోపాటు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నింటిని మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై యూనియన్ నాయకులు ఎర్రి స్వామి, ప్రసాద్, మురళి, నాగరాజు, రామాంజి, నాగార్జున, మునిరాజ్, మణి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి-హిందూపురం

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తున్నదని, అందుకోసమే మహిళలందరికీ డిజిటల్‌పై శిక్షణ ఇస్తున్నామనిమెప్మా డీఎంసీ. ఎల్. గంగులయ్య పేర్కొన్నారు. సోమవారం పురపాలక సంఘ పరిధిలో పలు మహిళా సంఘాల వారికి డిజిటల్ శిక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులను తీసుకురావడం జరుగుతున్నదన్నారు. పొదుపు సంఘాలలో ఉన్న సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో మెప్మా, డ్వాక్రా సభ్యులకు ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. మహిళలకు ఆర్థిక సహాయం చేయడమే కాకుండా అత్యాధునిక డిజిటల్ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇది వాట్సాప్ సేవలతో ఒక సమగ్ర ప్యాకేజీ సిద్ధం చేశారన్నారు. ఇందులో 12 రకాల సేవలను మెప్మా అధికారులు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజ్ఞ వర్చువల్ ట్రైనింగ్ అకాడమీ తరపున మహిళలకు 12 రకాల ఆన్ లైన్ సర్టిఫికెట్ కోర్సులు నేర్పిస్తున్నామన్నారు. ఇది పూర్తి చేసుకుంటే మహిళలు పారిశ్రామిక వేత్తలుగా తమ వ్యాపారాలను, చేయడానికి సులభతరం అవుతుందన్నారు. ఒక సంఘంలో ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదిగితే మిగిలిన 9 మంది సభ్యులు వారు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవకాశం ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సి ఓ లు సదానంద, నాగేంద్ర, తౌసిఫ్ అలీ ఖాన్, వరలక్ష్మి, గంగరత్నమ్మ, ఇబ్రహీం, తెలుగు తల్లి పట్టణ సమైక్య, భరతమాత పట్టణ సమైక్య నాయకులు విజయలక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంపై బాలయ్య మౌనం వీడాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం కేంద్రంగా సత్య సాయి జిల్లా ఏర్పాటుపై స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నోరు విప్పాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా విషయంపై సోమవారం ఎం ఎస్ ఎఫ్ నాయకులు హిందూపురం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వానికి అత్యధికంగా ఆదాయం సమకూర్చడంతో పాటు అన్ని విధాల అభివృద్ధి చెందిన హిందూపురం పట్టణం జిల్లా కేంద్రానికి అనువైన ప్రాంతం అన్నారు. గత వైసిపి ప్రభుత్వం హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించకపోవటంతో ఆ సమయంలో బాలకష్ణ జిల్లా కేంద్రం కోసం మెడికల్ కళాశాల కోసం ఆందోళన చేపట్టారని, ఆ ఆందోళనకు తాము కూడా మద్దతు పలికామని చెప్పారు. 2024 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హిందూపురం కేంద్రంగా సత్య సాయి జిల్లాలో ఏర్పాటు చేస్తామని బాలకృష్ణ ఎన్నికల హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన కోసం ఏడుగురు మంత్రులతో సబ్ కమిటీ వేయడం జరిగిందన్నారు. వేసిన సబ్ కమిటీ జిల్లాలో ఎక్కడ పర్యటించలేదన్నారు. సబ్ కమిటీ కన్వీనర్ మంత్రి అనగాని సత్యప్రసాద్ బాలకృష్ణ కు అత్యంత సన్నిహితులు కావడంతో తప్పకుండా జిల్లా వస్తారని అందరూ ఆశించామన్నారు. అయితే తమ అందరికీ నిరాశే మిగిలిందన్నారు. ఇప్పటికైనా బాలకృష్ణ జిల్లా కేంద్రం కోసం కషి చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.. ఈ సమావేశంలో నాయకులు అనిల్, హరీష్, సతీష్, సంతోష్, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలో గంజాయి తాగేవారు, విక్రయించేవారు, రవాణా చేసే వారు మొత్తం 14 మందిని పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి బ్యాచ్‌ను రెండు రోజుల క్రితమే పట్టుకొన్న పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ముదిగుబ్బ పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయి ప్రభావం అధికంగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పట్టుబడిన వారిలో ఎక్కువగా 14 నుంచి 20 ఏళ్ల లోపు ఉన్న వారు ఉన్నట్లు సమాచారం. బెంగళూరు నుంచి అనంతపురానికి అక్కడి నుంచి ముదిగుబ్బకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తేలింది. అందరినీ కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

రేషన్ మాఫియా, మద్యం అధిక ధరలను అరికట్టాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మండలంలో రేషన్ మాఫియాను అరికట్టాలని, మద్యం అధిక ధరలను నియంత్రించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో రెండు ప్రాంతాల్లో రేషన్ బియ్యం డంపింగ్ చేసి అక్రమంగా కర్నాటకకు పెద్దఎత్తున తరలిస్తున్నారన్నారు. అలాగే మద్యం షాపుల్లో బాటిల్‌పై ఎంఆర్‌పి కంటే అదనంగా రూ. 10 నుంచి రూ. 20 వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయాలపై దినపత్రికల్లో సైతం కథనాలు వచ్చాయన్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమయ్య, మాబు, కొండా వెంకటేష్, నాగభూషణ, చేనేత కార్మిక సంఘం నాయకులు నాగరాజు, వలి, ఆనంద్, వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం మసూద్,తదితరులు పాల్గొన్నారు.

ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్‌గా మణిప్రియ

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ సగర, ఉప్పర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా హిందూపురం నియోజకవర్గం జనసేన పార్టీకి చెందిన మణి ప్రియ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు ప్రభుత్వం నుండి నియామక ఉత్తర్వులు అందాయి. మణి ప్రియ ఉప్పర సంక్షేమ, అభివద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులు కావడం పట్ల మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఆకుల ఉమేష్, జనసేన నాయకులు నిమ్మకాయల రాము తదితరులు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచి ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తదితర కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా జెసితో పాటు డిఆర్‌ఒ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జెసి మాట్లాడుతూ మొత్తం 251 అర్జీలు అందాయన్నారు. ఎక్కువగా భూ సమస్యలు, రేషన్‌కార్డు, ఇళ్ల పట్టాలు, పింఛన్లు, తదితర సమస్యలు వచ్చాయన్నారు. వీటిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.

కుష్టు నిర్మూలన ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తగా కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించాలని జెసి అధికారులను ఆదేశించారు.

కుష్టు నిర్మూలన ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెసి

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై సోమవారం కలెక్టరేట్లో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడితే 6 నెలల్లో పూర్తిగా నయం అవుతుందన్నారు. జిల్లాలో ప్రతి వ్యక్తికీ, వసతి గృహాల్లో విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాల న్నారు. అనంతరం కుష్టు వ్యాధి నిర్మూలన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఫిరోజ్‌బేగం, జిల్లా కుష్టు నివారణ అధికారిణి డాక్టర్ అనుపమ, జెమ్స్, డిపిఎంఒ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-తనకల్లు

ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైపందని ఎపి రైతు సంఘం, సిపిఎం, సిఐటియు నాయకులు విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం గ్రీవెన్స్‌లో తహశీల్దార్ షాబుద్దీన్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛను, నిరుద్యోగులకు భృతి, రబీ సీజన్‌లో రైతులకు 90 శాతం రాయితీపై విత్తన వేరుశనగ, రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర, పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు, నూతన గృహాలు, గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు శ్మశానవాటికలు, తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ వెంటనే ఏవోను పిలిపించి ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు వీలైనంత త్వరగా వేరుశనగ అందించాలని సూచించారు. ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వి.వి.రమణ, సిపిఎం మండల కార్యదర్శి ఎం.శివన్న, సిఐటియు మండల కన్వీనర్ ఒంటెద్దు వేమన్న, రమణ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ షాబుద్దీన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం, సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పోలీసు అధికారులను సూచించారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, సైబర్ నేరాలు, ఇతర సమస్యలపై 66 అర్జీలు అందాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రతి ఫిర్యాదును స్వీకరించి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్‌బి సిఐ వెంకటేశ్వర్లు, సిఐలు శ్రీనివాసులు, ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైసిపి ప్రజాఉద్యమ మహార్యాలీ

ప్రజాశక్తి-అమరాపురం

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 12వ తేదీ మడకశిరలో వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా ఉద్యమ మహార్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ మడకశిర నియోజకవర్గ సమన్వ యకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. ముందుగా స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ త్రిలోక్, ఎంపిపి ఈరన్న, సర్పంచి గోవిందప్ప, ఎంపిటిసిలు నారాయణగౌడ్ నాగభూషణ్, కెంచప్ప, నాయకులు ఆటో తిప్పయ్య, నారాయణప్ప, ప్రసాద్, మంజునాథ్, పిడి నరసింహమూర్తి, సురేష్, స్వరూప్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడిపై దాడి హేయం

చిలమత్తూరు ప్రజాశక్తి పాత్రికేయుడు శంకర్‌పై దాడి చేసిన కాంట్రాక్టర్ నాగరాజుయాదవ్, ఆయన కుమారుడు హరీష్ యాదవ్, వారి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

లేపాక్షిలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి-గాండ్లపెంట

చిలమత్తూరు ప్రజాశక్తి పాత్రికేయుడిపై దాడి చేసిన కాంట్రాక్టర్ నాగరాజుయాదవ్, అతడి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక సిపిఎం నాయకులు కెకె.రాజారెడ్డి, ఖాదర్‌బాషా, హమాలీలు ఎం.కొండయ్య, బయన్న, నరసింహులు డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నంబులపూలకుంట : పాత్రికేయునిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక సిపిఎం నాయకులు గంగిరెడ్డి, చందన డిమాండ్ చేశారు.

పరిగి : సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఎప్పటికప్పుడు పత్రికల ద్వారా తెలియజేస్తున్న విలేకరులపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని జై భీమ్ భారత్ పార్టీ నాయకులు ఊటుకూరు నాగరాజు పేర్కొన్నారు. ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై దాడికి పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. వారి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను భయాందోళనకు గురి చేయడం సరికాదన్నారు. బాలకృష్ణ సొంత నియోజకవర్గంలో పాత్రికేయునిపై ఇలాంటి దాడులు జరగడం ఎమ్మెల్యే పనితీరుకు నిదర్శనం అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులను పోలీసులు తక్షణమే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో విలేకరి హరిప్రసాద్, కదిరప్ప, మూర్తి, నరసింహ పాల్గొన్నారు.

లేపాక్షి : పాత్రికేయునిపై దాడి చేసిన టిడిపి నాయకులు నాగరాజు యాదవ్, హరీష్ యాదవ్, వారి అనుచరులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సిపిఎం మండల కన్వీనింగ్ కమిటీ కార్యదర్శి కృష్ణమూర్తి తహశీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతి పత్రం అందచేశారు. అలాగే మండలంలోని వివిధ పత్రికల పాత్రికేయులు తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు.

నల్లచెరువు : చిలమత్తూరు ప్రజాశక్తి రిపోర్టర్ శంకర్‌పై దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని సిపిఎం మండల కన్వీనర్ రామకృష్ణ పేర్కొన్నారు. దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత న్యాయవ్యవస్థపై ఉందన్నారు

కదిరిటౌన్ : విలేకరిపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా సిపిఎం నాయకులు జగన్మోహన్, బాబ్‌జాన్, సాంబశివ, రామ్మోహన్ పేర్కొన్నారు. దాడికి పాల్పడిన టిడిపి నాయకుడు నాగరాజుయాదవ్, అతని కుమారునిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్తచెరువు : ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై దాడి చేసిన టిడిపి నాయకులు గొల్ల నాగరాజు యాదవ్, కుమారుడు హరీష్ యాదవ్, వారి అనుచరులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు డిమాండ్ చేశారు. రహదారి పనులను నాసిరకంగా చేస్తున్నారని పత్రికలో రాసినందున పథకం ప్రకారం విలేకరి ఇంటిపై, ఆయనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. తక్షణమే వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నల్లమాడ : వార్త రాసినందుకు ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై దాడి చేసిన వారిని చట్టపరంగా విచారించి కఠినంగా శిక్షించాలని మండల సిపిఎం నాయకులు గోవిందు, మల్లికార్జున, రామయ్య, తిప్పన్న, రాజు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

నేడు సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఈ నెల 11వ తేదీ అనంతపురంలో జరిగే రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ హమాలీ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు పిలుపునిచ్చారు. ముదిగుబ్బలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ హమాలీ యూనియన్ సమావేశానికి జి.ఓబులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హమాలీలకు 25 కిలోల బియ్యం బ్యాగుకు రూ. 10 కూలి ఇవ్వాలని, నగదు బదిలీ పథకం ఆలోచన విరమించుకోవాలని, ఈఎస్ఐ అడ్డంకులు తొలగించి వెంటనే అమలు చేయాలని, స్టాక్ పాయింట్ల దగ్గర హమాలీలకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, హమాలీలను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఆటో పెద్దన్న, ఆవాజ్ నాయకులు బాబ్‌జిన్, పక్కీరప్ప, హమాలీ యూనియన్ నాయకులు సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయించాలని వినతి

ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ఆధ్వర్యంలో ట్రాలీ యూనియన్ కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండలంలోని 70మంది ఆటో కార్మికులు 2004 నుంచి సిఐటియు అనుబంధంగా భగత్‌సింగ్ యూనియన్ పేరుతో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకున్నార న్నారు. ఆ తర్వాత ట్రాలీ యూనియన్‌గా పేరు మార్చుకున్నారన్నారు. అయితే రోడ్డు వెడల్పులో భాగంగా ఆటో స్టాండ్ స్థలంలో డ్రెయినేజీ కాలువలు ఏర్పాటుచేయడంతో పాటు కొందరు బంకులు ఏర్పాటు చేశారన్నారు. వారిని అడ్డుకోగా కార్మికులపై కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని లేనిచో సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆటో పెద్దన్న, ఆవాజ్ నాయకులు బాబ్‌జాన్, ట్రాలీ యూనియన్ నాయకులు శ్రీరామ్‌రెడ్డి, హరి, పక్కీరప్ప పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ఓబుళదేవరచెరువు : ఈ నెల 11వ తేదీ అనంతపురంలో జరిగే రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ హమాలీ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు పిలుపునిచ్చారు. స్థానిక బియ్యం గిడ్డంగి వద్ద నిర్వహించిన సమావేశంలో ఓబులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ వి.వి.రమణ, సిపిఎం మండల కన్వీనర్ కుళ్లాయప్ప, హమాలీలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బామ్మర్ది చేతిలో బావ హతం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మాలాన్ బాషా(ఫైల్‌ఫొటో)

క్షణికావేశంలో బావను బామ్మర్ది హత్య చేసిన సంఘటన ఆదివారం రాత్రి పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో చోటు చేసుకుంది. టూ టౌన్ సిఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు.. మలాన్‌బాషా(40) మగ్గం నేస్తూ, కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పట్టణంలోని బోయ వీధికి చెందిన రాధను 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అయితే ఇటీవల కాలంలో రాధ మరో యువకుడితో సన్నిహితంగా ఉంటుందని అనుమానించి మలాన్‌బాషా తీవ్రంగా మందలించాడు. ఈ విషయాన్ని రాధ తన సోదరుడు రామచంద్రకు తెలిపింది. దీంతో రామచంద్ర స్నేహితులతో కలిసి మలాన్‌బాషా ఇంటికి వెళ్లి గొడవ పెట్టుకున్నాడు. మాటా మాటా పెరగడంతో రామచంద్ర అక్కడే ఉన్న పూలకుండీతో మలాన్‌బాషా తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే సిఐ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ సుపత్రికి తరలించి శవ పరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రామచంద్రతో పాటు అతని స్నేహితులపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. దాడికి పాల్పడిన వారు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

రొద్దం : మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(71) సోమవారం ఉదయం తన సొంత పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. నరసింహారెడ్డి మూడు రోజుల క్రితం బెంగళూరులోని ఓ ఆసుపత్రికి వెళ్లగా పరీక్షించిన వైద్యులు క్యాన్సర్ ఉందని తెలిపారు. దీంతో మనోవేదనకు గురై తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు.

బాలికల హాస్టల్‌లోకి చొరబడిన వ్యక్తి అరెస్టు

కదిరి టౌన్ : పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో అక్రమంగా ప్రవేశించి వాచ్‌ఉమెన్, విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. ఈ నెల 4వ తేదీ రాత్రి కుమ్మరవాండ్లపల్లి గ్రామానికి చెందిన యార్ల మహేష్ పట్టణంలోని అడపాల వీధిలో ఉన్న ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ దూకి హాస్టల్‌లోకి అక్రమంగా చొరబడ్డాడు. అతడిని అక్కడ పనిచేసే వాచ్‌ఉమెన్ భూక్యా ఉమాదేవిభాయి, బాలికలు అతడిని పట్టుకునే ప్రయత్నం చేయగా వారిని కర్రతో భయపెట్టి గోడ దూకి పారిపోయాడు. దీంతో వాచ్‌ఉమెన్ ఫిర్యాదు మేరకు ఈ నెల 7వ తేదీ కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో యార్ల మహేష్‌ను కమ్మరవాండ్లపల్లి గ్రామ శివారులో అరెస్టు చేశారు. కదిరి మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించగా కదిరి సబ్ జైలుకు తరలించారు.

కారు, బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ : ముదిగుబ్బ సమీపంలో సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పులివెందులకు చెందిన గౌస్‌పీరా భార్యతో కలిసి బైక్‌పై అనంతపురం నుంచి పులివెందులకు వెళ్తుండగా మార్గమధ్యలో ముదిగుబ్బ వద్ద అనంతపురం బైపాస్ రోడ్డులో వడ్డీపేట సమీపంలో కదిరి నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గౌస్‌పీరా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే హెడ్ కానిస్టేబుల్ షౌకత్‌అలీ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

ఫుట్‌బాల్ పురుషుల జట్టుతో మంగళకర అధ్యాపక బృందం

ఫుట్‌బాల్ పోటీల్లో 'మంగళకర' విద్యార్థుల ప్రతిభ

పుట్టపర్తి రూరల్ : మండలంలోని జగరాజుపల్లి గ్రామం వద్ద ఉన్న మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్‌కెయు అంతర కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటారని కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 6, 7, 8 తేదీల్లో గుంతకల్లు పట్టణంలోని ఎస్ఎస్‌జిఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టుపై గెలిచి విజేతలుగా నిలిచారన్నారు. గెలుపొందిన క్రీడాకారులను ఆర్యప్రకాష్, ఏవో జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, అధ్యాపక బృందం, పిడి శ్రీనివాసులు అభినందించారు.

రైతులకు యూరియా పంపిణీ

గోరంట్ల : మండలంలోని బూదిలి గ్రామ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. సహకార సంఘం అధ్యక్షులు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకీ యూరియా అందిస్తామని, రైతులు తీసుకెళ్లి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ అన్వర్, టిడిపి నాయకులు ప్రభుశంకర్, ఈడిగ కుమార్, ఈడిగ రవి, రామచంద్ర, రైతులు పాల్గొన్నారు.

రామాచార్యుల స్ఫూర్తిని కొనసాగించాలి

బుక్కపట్నం : నేటి తరం విద్యార్థులు రామాచార్యుల స్ఫూర్తిని కొనసాగించాలని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ సూచించారు. పప్పూరు రామాచార్యుల జయంతి సందర్భంగా సోమవారం స్థానిక డైట్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పుస్తకాలు అందుబాటులో లేని రోజుల్లోనే వ్యక్తిత్వ వికాసానికి గ్రంథ పఠనం ఎంతో అవసరమని గుర్తించి స్వయంగా పుస్తకాలు సేకరించి పుస్తకాల ఆవశ్యకతను తెలిపిన మహోన్నత వ్యక్తి రామాచార్యులు అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రామాచార్యులు స్మారక కమిటీ ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

మడకశిర టౌన్ : పట్టణ పరిధిలోని ప్రజలు సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తే సత్వరం పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. స్థానికనగర పంచాయతీ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

గోరంట్ల : మండలంలోని పులేరు గ్రామ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సోమవారం ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మంత్రి సవిత ఆదేశాలు మేరకు టిడిపి నాయకులు విద్యార్థులకు స్కూల్ డైరీలు పంపిణీ చేశారు. టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన చదువుతో పాటు మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ నాయకులు నరసింహులు మాజీ సర్పంచ్ నరేష్ చంద్రారెడ్డి డిష్ శ్రీనివాసులు నిమ్మల శ్రీధర్ అజమతుల్లా నాగే నాయక్ ఉత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ డైరీలు పంపిణీ చేసిన టిడిపి నాయకులు

విద్యుత్ సమస్య సృష్టిస్తే చర్యలు : ఏఈ

ప్రజాశక్తి-రొద్దం

పంటపొలాల్లో విద్యుత్ వైర్లను పరిశీలిస్తున్న ఏఈ

విద్యుత్ సమస్య సృష్టించే వారిపై చర్యలు తప్పవని విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌మూర్తి హెచ్చరించారు. మండలంలోని రాగిమేకలపల్లి, తురకలాపట్నం విద్యుత్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో రైతులు పంటలను అడవి పందులు, జింకల నుంచి కాపాడుకోవడానికి రాత్రి వేళ 11 కెవి లైన్‌కు వైర్లు తగిలించి, మిగిలిన వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ విషయం తెలిసి సోమవారం ఏఈ లైన్‌మెన్ మస్తాన్‌తో కలిసి ఆయా సబ్ స్టేషన్ల కింద విద్యుత్ అంతరాయం కలిగిస్తున్న పంటపొలాలను పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ తమ పంటల కోసం ఇతరులకు సమస్య కలిగించడం తగదన్నారు. ఇకపై అలా చేస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిపిఎం కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న సిపిఎం కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో సుమారు 150 మంది నిరుపేదలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. నేటికీ కాలనీలో విద్యుత్, నీరు, తదితర కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎంపిడిఒకు, అధికారులను పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేదని వాపోయారు. వారం రోజుల్లో సిపిఎం కాలనీలో సమస్యలు పరిష్కరించుకుంటే రిలే నిరాహార దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు స్వర్ణలత, అంజలి, ముత్యాలప్ప, ఆంజనేయులు, లోకేష్, లక్ష్మీ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం సొసైటీ జిల్లా ఛైర్మన్ జిఎం.శేఖర్, సెక్రటరీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జీవిత కాల సభ్యులు హాజరయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అబ్జర్వర్ రవిప్రకాష్, ఎన్నికల అధికారిగా కృష్ణానాయక్ వ్యవహరించారు. ఛైర్మన్‌గా జిఎం.సురేష్, వైస్ ఛైర్మన్‌గా పెద్దరాసు భక్తవత్సలం, కోశాధికారిగా కుమారస్వామిరెడ్డి, సభ్యులుగా జి.జగదీష్, జి.సల్మాన్‌రాజు, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ వెంకటరమణ, డి.శివశంకర్‌రెడ్డి, పి.మల్లికార్జున, కె.కిషోర్‌బాబు, సంజీవ, లక్ష్మీ, లను ఏకగ్రీవంగా ఎన్నుకుని సన్మానించారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా జిఎం.శేఖర్, జిల్లా కార్యదర్శిగా విశ్వనాథ్‌ను కొనసాగించడానికి తీర్మానించారు. సమావేశంలో ఐఆర్‌సిఎస్ జిల్లా కోఆర్డినేటర్ బి.రమేష్. తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం

అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

గాండ్లపెంట : స్థానిక చిన్న మిట్ట వద్ద నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ఐదు రోజుల నుంచి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చివరి రోజై సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపిపి జి.సోమశేఖర్‌రెడ్డి, ఆనంద్, పవన్‌కుమార్, సిద్ధారెడ్డి, అయ్యప్ప భక్తులు ఉన్నారు.

రొద్దంలో కనకదాసు విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కనకదాసు విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

రొద్దం : రొద్దంలో కనకదాసు విగ్రహం ఏర్పాటు చేసేందకు సోమవారం కురుబ సామాజిక వర్గం ప్రజలు స్థలాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో ఉన్న సింగిల్‌విండో కార్యాలయం సమీపంలో స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అశ్వర్థనారాయణ, చెన్నకేశవులు, చంద్రశేఖర్, హరి, చంద్రశేఖర్, హనుమంతు, పాల కుమార్, దాసరి రామాంజి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

ముదిగుబ్బ : మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల ముదిగుబ్బలో ఏర్పాటు చేయనున్న పరీక్ష కేంద్రాలను సోమవారము విద్యా శాఖ అధికారులు పరిశీలించారు. జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లాజర్ స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించి, గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, కుర్చీలు తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు.

రైల్వే బ్రిడ్జి వద్ద లైట్లు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక పెనుకొండ రహదారిలో రైల్వే బ్రిడ్జి కింద, నల్లగొండ రైల్వే సొరంగంలో లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినత పత్రం అందజేశారు. ఆయన ఆయా ప్రాంతాల్లో లైట్లు లేనందున రాకపోకలు సాగించాలంటే మహిళలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగాయన్నారు. అలాగే కొత్తచెరువులో పలు వీధుల్లో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే లైట్లు ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు.

ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం

తలుపుల : వైద్య సేవల కోసం స్థానిక పిహెచ్‌సికి వచ్చిన గర్భిణులు, వైద్యసిబ్బంది మొత్తం 130 మందికి సోమవారం రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పులివెందుల డీఎస్పీ మురళినాయక్ మాట్లాడుతూ ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ చిన్నతనంలోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. వారి సేవలను మెచ్చి డీఎస్పీ రూ. 10 వేలను ట్రస్టు సభ్యులుకు అందజేశారు. కార్యక్రమంలో మన్సూర్, వైద్యాధికారి ఆశ్రిత, సూపర్వైజర్ రామ్మోహన్, రాముడు, ప్రభు, వేణు, ట్రస్టు సభ్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

మడకశిర టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మె ల్యే ఎంఎస్.రాజు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. నియోజక వర్గంలోని మొత్తం 58 మందికి రూ.18,53,698 చెక్కులను మంజూరు కాగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సిఎం సహాయనిధి ఓ వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర వక్కలిగ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు : ఆర్టీవో

కదిరి అర్బన్ : వాహనదారులు, డ్రైవర్లు రవాణా శాఖ నియమ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని కదిరి ఆర్‌టిఒ శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఆర్టీవోతో పాటు ఎంవిఐలు వరప్రసాద్, రాజేష్ ప్రయివేటు స్కూల్ వాహనాలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ రవాణా శాఖ అధికారుల సూచనలు తప్పకుండా పాటించాల న్నారు. ప్రయివేటు స్కూల్ బస్సులు కండిషన్‌లో పెట్టుకోవాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. సూచనలు, సలహాలు పాటించకపోతే వాహన ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని డ్రైవర్లకు సూచించారు. బస్సులో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే డ్రైవర్లు ఎలా వ్యవహరించాలో సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా నిర్మాణానికి విరాళం

తలుపుల : మండలంలోని నూతన్‌కాలువ గ్రామంలో మహబూబ్ సుబహాని దర్గా నిర్మాణానికి మండల వైసిపి మాజీ సర్పంచి డీపీ ఫయాజ్ అహ్మద్ విరాళం అందజేశారు. ఆయన రూ. 5వేలను కమిటీ సభ్యులకు అందజేశారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

గాండ్లపెంట : జిల్లా స్థాయిలో నిర్వహించిన రిటైల్ స్కిల్ మార్కెట్ ప్రాజెక్టు ప్రదర్శనలో స్థానిక జడ్పిటిసి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ చాటి బహుమతులు అందుకున్నారు. దీంతో సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలు టి.రజితను హెచ్‌ఎం టి.ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపిక అందజేసి అభినందించారు. వారు మాట్లాడుతూ రజిత సహకారం, చొరవతోనే విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్, శ్రీనాథ్‌రెడ్డి, రాజరత్నం, విద్యార్థులు, పాల్గొన్నారు.

నేడు టిడిపి నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

కదిరి అర్బన్ : ఈ నెల 11వ తేదీ స్థానిక మదనపల్లి రోడ్డులోని పివిఆర్ ఫంక్షన్ హాలులో టిడిపి మండల, క్లస్టర్, యూనిట్, విలేజ్, బూత్ నూతన కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వెలువడిన ఓ ప్రకటనలో తెలిపారు. ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హాజరవుతారన్నారు. నియోజకవర్గ పరిధిలోని టిడిపి శ్రేణులు సభ్యత్వ నమోదు కార్డుతో హాజరు కావాలన్నారు.